దేవరకొండ పట్టణాభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బాలూనాయక్
- ఖిల్లా అభివృద్ధి పనుల పరిశీలన

ఖిల్లా అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జూన్ 18 : దేవరకొండ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. పట్టణంలోని 1, 13 15, 16, వార్డుల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఖిల్లా ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిశీలించి కార్యాలయాల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాల్సిందిగా అధికారులను సూచించారు. పట్టణంలోని ఆయా వీధుల్లో చేపట్టాల్సి సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనుల నిర్మాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెల వరకు ఖిల్లా పార్కింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. ఖిల్లా బావిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. షాదీ ఖానా పనులను త్వరగా పూర్తి చేయాలని, వార్డుల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరగా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు హనుమంతు వెంకటేశ్‌గౌడ్, భూదేవి సైదులు, కొర్ర రాంసింగ్‌నాయక్, కిన్నెర హరికృష్ణ, జైప్రకాశ్, గాజుల మురళి, ఏఈలు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ పనులను తిరిగి ప్రారంభిస్తాం

పదేండ్లు పడావుపడ్డ ఎస్ఎల్‌బీసీ పనులను తిరిగి ప్రారంభిస్తామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండలోని తన నివాసంలో మంగళవారం ఇరిగేషన్ శాఖ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే మాట్లాడుతూ డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భూసేకరణ ఆర్‌అండ్‌ఆర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, డిండి కాల్వల ఆధునీకరణకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ కల నెరవేరబోతుందని, దేవరకొండ రైతుల కన్నీరు తుడుస్తామని పేర్కొన్నారు. జూన్ 28న డిండి ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

సజావుగా నెట్

రామగిరి, జూన్ 18: నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన యూజీసీ నెట్ సజావుగా ముగిసింది. చర్లపల్లిలోని నలంద ఫార్మసీ కళాశాల, పట్టణంలోని ఆల్ఫా జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షలకు 1,119 మంది అభ్యర్థులకు 921 మంది హాజరైనట్లు పరీక్షల ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్, ది నల్లగొండ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పార్థసారథి తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గం. వరకు వివిధ సబ్జెక్టుల్లో పరీక్షలు కొనసాగాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ ఆర్



బీసీ హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల్లోవిద్యార్థులు సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్ తోపా బీసీ సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో నైపుణ్యాలు పెంచేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీపీ పుట్టల సునీత, ప్రత్యేకాధికారి వసంతకుమారి, ప్రధానోపాధ్యాయులు రమేశ్, నాయకులు రావు ఎల్లారెడ్డి, మాలి కాంతారెడ్డి, పాండు, ఉపాధ్యాయులు అయ్య పరెడ్డి, సుధాకర్, సైదిరెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి శుభాకాంక్షలు

కలెక్టర్‌కు బోకే అందిస్తున్న జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 18: నల్లగొండ జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త కలెక్టర్ నారాయణ రెడ్డికి మంగళవారం జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి బోకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శాలువాతో సన్మానించారు. ఆయన వెంట సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస రావు, కొప్పు రాంబాబు, నరేందర్ రెడ్డి ఉన్నారు.

నేటి నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చందంపేట(నేరెడుగొమ్ము), జూన్ 18 : మండలంలోని సుద్దబాయితండా సమీపంలో ఉన్న బాలాజీ, బర్మా వేంకటేశ్వరస్వామి, తులసి సాధ్ మహారాజ్ ఆలయంలో ఈనెల 19 నుంచి 26 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి వాంకుణావత్ బిక్కునాయక్, కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఆలయ శుద్ధి, 20న భంగారి గుండ్ల తులసిసాధ్ మఠం వద్ద ప్రత్యేక పూజలు, 21న ఆంధ్ర రాష్ట్రంలోని కాకిరాల బర్మా వేంకటేశ్వరస్వామి ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లడం, 22న స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 23న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 24న చివరి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి సభ్యులు, పూజారి తెలిపారు. సుద్దబాయితండా, బుగ్గతండా గ్రామాల ప్రజలు ఈ పూజల్లో పాల్గొనాలని పూజారి కోరారు.

రేపు త్రిపురారం, మర్రిగూడ మండల సమావేశాలు

త్రిపురారం, జూన్ 18: ఈనెల 20న ఎంపీడీఓ కార్యాలయాల్లో త్రిపురారం, మర్రిగూడ మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయకుమారి, ఎంపీడీఓ చిన మునయ్య మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ సిటీ, జూన్ 18 : విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు రాక్ హిల్స్‌కాలనీ, సూర్యవంశీ కాలనీ, సాయిశ్రీకాలనీ, ఎస్ఎల్ఎన్‌స్వామి కాలనీ, మోహన్‌రెడి కాలనీ, శ్రీనగర్ కాలనీ, తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే కాదు ప్రతి తల్లిదండ్రులపైనా ఉందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023-24 పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు, హ్యాండ్ బాల్ జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్నారని, దాని ఫలితమే 9.8, 9.7 జీపీఏ ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచితే ఎంపీపీ శ్రీదేవి కోరిక భవనాలు నిర్మించే బాధ్యత తీసుకుంటానని హామీనిచ్చారు. పదోతరగతి పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, హ్యాండ్ బాల్ జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి క్రీడాకారులను నగదు ప్రోత్సాహక, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి, బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గంగాధర్‌రావు, ఎంఈఓ మేక నాగయ్య, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగుల వంచ వెంకటేశ్వర్‌రావు, నాయకులు చామల శ్రీనివాస్, నకిరేకంటి ఏసుపాదం, లింగాల వెంకన్న, పన్నాల రాఘవరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పరామర్శ

ఫలిదొద్దిన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 18: తెలంగాణ ఉద్యమ నాయకుడు సయ్యద్ ఫరీదోద్దీన్ కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం నల్లగొండలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు జమాల్ ఖాద్రి, పట్టణ పార్టీ కార్యదర్శి సయ్యద్ జాఫర్, జాఫర్ పటేల్, పార్టీ మండలాధ్యక్షుడు దేవ వెంకటరెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్, తవిటి కృష్ణ, కార్యదర్శి బడుపుల శంకర్, యూసుఫ్ బాయ్, మామిళ్ల సైదులు ఉన్నారు.

మాడ్గులపల్లి ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు

అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

మాడ్గులపల్లి, జూన్ 18 : ఈనెల 6 నుంచి 11 వరకు కులు మనాలి, హిమాచల్‌ప్రదేశ్‌లో సిగ్మా అకాడమీ ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫొటోగ్రఫి వర్క్‌లో మండలంలోని తోపుచర్ల గ్రామానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పోటీలకు సుమారు 40 మంది ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారని తెలిపారు. అడ్వాన్స్ ఫోటోగ్రఫి, అడ్వెంచర్, ట్రావెల్, పిక్టోరియల్ ఫొటోగ్రఫి వంటి అంశాలతో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫొటోగ్రాఫర్లలో ప్రతిభను వెలికితీయడానికి ఈ ఫోటోగ్రఫి వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. తనకు ఈ అవార్డు అందడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

ఊర చెరువులో ఆక్రమణను తొలగించాలని వినతి

ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న కొండ్రపోల్ గ్రామస్తులు

మిర్యాలగూడ, జూన్ 18 : దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామంలోఊర చెరువు ఆక్రమణను తొలగించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కబ్జాదారుల నుంచి చెరువును కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ 176.30 ఎకరాల్లో చెరువు భూమి ఉందని అట్టి చెరువు కింద సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు భూములను సాగు చేసుకుంటుండగా, వందలాది మంది మత్స్యకారులు జీవనం పొందుతున్నారని పేర్కొన్నారు. కానీ అక్రమార్కులు 50 ఎకరాల మేరకు చెరువు భూమిని కబ్జా చేయడంతో చెరువులో నీటి నిల్వ లేక గ్రామంలో రైతులు సాగు చేసిన పంట పొలాలు ఎండిపోతుండడంతో ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి చెరువుకు సర్వేను నిర్వహించి హద్దురాళ్లను నిర్ధారించి ప్రస్తుతం ఉన్న అలుగు ఎత్తును మరో రెండు అడుగుల వరకు పెంచి నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మట్టారెడ్డి, పాపయ్య, సురేశ్, వెంకన్న, రవితేజ పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలుకు వేలం

అడవిదేవులపల్లి, జూన్ 18 : మండలకేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయ భూముల కౌలు వేలం బుధవారం ఉదయం 10గంటలకు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి మేనేజర్ కొంకపాక మృత్యుంజయశాస్త్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సర్వే నంబర్లలో గల ఆలయానికి సంబంధించిన 45.61ఎకరాల భూమి కౌలు వేలాన్ని నిర్వహిస్తున్నందున ఆసక్తిగల వారు ముందుగా రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని అన్నారు.

గ్యాస్ సిలిండర్ నేరుగా అందించాలి: సీపీఎం

శాలిగౌరారం, జూన్ 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500లకే నేరుగా వినియోగదారులకు గ్యాస్ సిలిండర్‌ను అందించాలని సీపీఎం మండల కార్యదర్శి చెలకాని మల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. వినియోగదారులు మొత్తం నగదును చెల్లిస్తే సబ్సిడీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతుందని అన్నారే కానీ అమలు కావడం లేదన్నారు. కొంత మందికి మాత్రమే డబ్బులు పడుతుండడంతో వినియోగదారులు ప్రభుత్వం అందించే పథకానికి అర్హులు కాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారులకు లాభం చేకూరాలంటే ప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను నేరుగా అందించాలన్నారు.

శిఖం భూముల్లో సర్వే చేపట్టాలని వినతి

నిడమనూరు, జూన్ 18 : ముప్పారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం పరిధిలోని నిడమనూరు నల్లచౌట చెరువు, సోమోరి గూడెం సోములవారి చెరువు, ముప్పారం రామినేని కుంట, నర్లకుంట శిఖం భూముల సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ సంఘం అధ్యక్షుడు కోట్ల సైదులు ఆధ్వర్యంలో కలెక్టర్ నారాయణరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ చెరువు శిఖాన్ని కొందరు ఆక్రమించి సాగు చేస్తున్న కారణంగా చెరువుల రూపురేఖలు మాయమవుతున్నట్లు తెలిపారు. చెరువులు కుంచించుకు పోతున్న కారణంగా 350 మంది మత్స్యకార కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సంఘం మాజీ చైర్మన్ మంగినపల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు గుండు నర్సింహ, కార్యదర్శి మంగినపల్లి మల్లయ్య, మాజీ కార్యదర్శి దాసరి రాములు, మాజీ ఉపాధ్యక్షుడు పగడాల దుర్గయ్య, డైరెక్టర్లు తెల్కపల్లి శంకర్, మర్రి చిన్న దుర్గయ్య, రాకేశ్ కుమార్, మర్రి శ్రీను, పూస సైదులు తదితరులున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు పట్టివేత

మునుగోడు,జూన్ 18 : మండలంలోని కొరటికల్ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ తరలించిన మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేయాలని వినతి

ఎంవీఐ వీరస్వామికి వినతిపత్రం అందిస్తున్న బీసీ, మాల మహానాడు విద్యార్థి సంఘం నాయకులు.

మిర్యాలగూడ, జూన్ 18: ఫిట్‌నెస్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం, మాల మహానాడు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఎంవీఐ వీరస్వామికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవి మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్‌నెస్ లేని బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో బట్టు శ్రీకాంత్, మహ్మద్ గౌస్, నాగరాజు, సురేశ్, గోపి, శ్రీను పాల్గొన్నారు.

శివనేనిగూడెంలో సీసీ కెమెరాలు ప్రారంభం

గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చిట్యాల, జూన్ 18 : చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామానికి చెందిన మత్స్య సొసైటీ చైర్మన్ నూతి సైదులు ముదిరాజ్ సొంత ఖర్చుతో గ్రామంలో రూ. 43 వేల విలువ చేసే 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. ఈ కెమెరాలను మంగళవారం గ్రామంలో అమర్చారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో జరుగుతున్న దొంగతనాలు తన గ్రామాల్లో జరుగకుండా అరికట్టడంతోపాటు ఆకతాయిలు ఆగడాలను కూడ తగ్గించడానికి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వానలు కురవాలని బొడ్రాయికి జలాభిషేకం

బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

నార్కట్‌పల్లి, జూన్ 18: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని చెర్వుగట్టులో మంగళవారం గ్రామస్తులు గ్రామంలో బొడ్రాయికి, గ్రామ దేవుళ్లకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్గ బాలకృష్ణ, చీర మల్లేశ్, చీర భిక్షం, బండ లింగయ్య, కడగంచి శంకర్, మోటె లక్ష్మణ్, మందుల నర్సింహ, కొండూరి మల్లయ్య, గంట శేఖర్, చీర శంకర్, మిర్యాల రమేశ్, దయ్యాల స్వామి, చీర నరేశ్, కప్పె శ్రీశైలం, కొండూరి శివ, మచ్చ జగదీశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి : ఏఐటీయూసీ

మునుగోడు, జూన్ 18 : అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం సీడీపీఓ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు చాపల శ్రీను మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీ ప్రకారం అంగన్‌వాడీలకు రూ.18 వేల వేతనం చెల్లించాలని, విశ్రాంత టీచర్లుకు రూ. 10 లక్షలు,ఆయాకు రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 24 రోజుల సమ్మెకాలపు వేతనాలు చెల్లించాలని అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ, కార్యదర్శి నెల్లికంటి అన్నపూర్ణ, పారిజాత, ఈన్నసమ్మ పాల్గొన్నారు.

దేరకొండరూరల్(దేవరకొండ) : తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు మంగళవారం సీడీపీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు శాంతాబాయి, ప్రాజెక్టు అధ్యక్షురాలు మణెమ్మ, భాగ్య, స్వప్న, భాగ్యలక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలి : డీడీఏ మాధవి

సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

త్రిపురారం, జూన్ 18 : రైతులు సమీకృత వ్యవసాయంపై దృష్టి సారించాలని రాష్ట్ర అగ్రికల్చర్ అసిస్టెంట్ సంచాలకురాలు మాధవి అన్నారు. మండలంలోని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతుల ఖాతాల్లో 17వ సారి డబ్బులు జమ అవుతున్నాయని, పెట్టుబడి సాయంగానే స్వీకరించాలని, రైతుల అభ్యున్నతి కోసం, రైతుల శ్రేయస్సు కోసమే ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. కేవీకేల ద్వారా రైతులు వివిధ సలహాలు, సూచనలు తీసుకోవాలని, అపరాలు వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సత్యనారాయణ, నివేదితారెడ్డి, హాలియా అగ్రికల్చర్ ఏడీఏ వెంకటరవీంద్ర, హార్టికల్చర్ ఎస్ఓ మురళి, వ్యవసాయ కళాశాల అధిపతి డాక్టర్ ఎన్.లింగయ్య, త్రిపురారం ఏఓ పార్వతీచౌహాన్, శాస్త్రవేత్తలు పల్లవి, రాములమ్మ, చంద్రశేఖర్‌తోపాటు ఏఓలు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

నగదు అందజేస్తున్న వనమా వెంకటేశ్వర్లు, తదితరులు

చిట్యాల, జూన్ 18 : చిట్యాల జడ్పీహెచ్ఎస్‌లో గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. చిట్యాలకు చెందిన కొరివి బుచ్చయ్య సుశీల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకన్న తరుపున పాల్వాయి శ్రీనివాసు అర్చన మంగళవారం అందజేశారు. మొదటి ర్యాంకు వచ్చిన పొలాస శ్రీవిద్యకు రూ. 20వేలు, రెండో ర్యాంకు వచ్చిన పబ్బతిరెడ్డి సుష్మకు రూ. 10వేలు, 3వ ర్యాంకు వచ్చిన విద్యార్థికి రూ. 5 వేలు అందజేశారు.కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, ఇమ్మడి వెంకటేశ్వర్లు, పందిరి రమేశ్, బూరుగు కృష్ణయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చందులాల్

చందంపేట, జూన్ 18 : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి చందులాల్‌నాయక్ అన్నారు. చందంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని చిత్రియాల, తెల్దేవర్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజలకు టీ.బీపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టీ.బీ లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో టీ.బీ నోడల్ అధికారి భాస్కర్, ఏఎన్ఎంలు పార్వతి, స్వప్న, ఆశ వర్కర్లు కోటమ్మ, జ్యోతి, పార్వతి, రాజేశ్వరి, స్వప్న పాల్గొన్నారు.

పుస్తెల తాడు చోరీ

చిట్యాల, జూన్ 18 : ఇంటి బయట నిద్రిస్తున్న మహిళ మెడ నుంచి పుస్తెల తాడును అపహరించిన సంఘటన చిట్యాలలో జరిగింది. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాలలోని ముత్యాలమ్మ గూడెం ప్రాంతంలో నివసించే కంబాలపల్లి ఆండాలు సోమవారం రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో గుర్తు తెలియని ఆమె మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును దొంగిలించుకొని పారిపోయాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

బైక్‌లు ఢీ కొని ఇద్దరు దుర్మరణం

నల్లగొండ సిటీ, జూన్ 18 : అతి వేగంగా వెళ్తూ బైక్ మరో బైక్‌ను వెనుక నుంచి ఢీ కొనడంతో ఓయువతి, ఓ యువకుడు మృతి చెందారు. ఈ ఘటన కనగల్ మండలం బాబాసాయిగూడెం స్టేజి సమీపంలో మంగళవారం జరిగింది. కనగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నిడమనూరు మండలం గోవిందన్నగూడెం గ్రామానికి చెందిన కొండ కిష్ణయ్య రైతు. కుమార్తె అరుంధతి(22) కోరిక మేరకు నల్లగొండ లోని అయ్యప్ప ఆలయానికి వెళ్లడానికి ఉదయం 6 గంటలకు బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో బాబాసాయిగూడెం స్టేజీ సమీపంలోకి రాగానే తిరుమలగిరి(సాగర్)కి చెందిన బత్తుల పవన్‌కుమార్(23) పల్సర్ బైక్‌పై వేగంగా వచ్చి వెనుక నుంచి ఢీ కొట్టాడు. దాంతో బైక్ వెనుక కూర్చొన్న అరుంధతి ఎగిరి పడగా కృష్ణయ్య కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. పవన్‌కుమార్‌కు తీవ్ర గా